స్కెచ్

# ఎత్తు పల్లాలు

ద్రోణంరాజు కృష్ణమోహన్

"ఐస్ ఫ్రూట్ కాణీ కాణీ, ఐస్ ఫ్రూట్"

అరుస్తూ ఎనిమిదేళ్ల కుర్రాడు చేతిలో ఆ ఐసు పెట్టె వూగించుకుంటూ వెడుతున్నాడు. ఎండ మండిపోతోంది. మంచి వేసవి కాలం. ఆ కుర్రాడికి చెప్పులు లేవు. నెత్తిమీద తుండుగుడ్డ కూడా లేదు. చెమటలు కారిపోతున్నాయి. ఎలా వినబడిందో ఆ కేక మావాడికి వినబడింది పరుగెత్తుకొచ్చాడు ఆడుకుంటూన్న సామాను అక్కడ పారేసి.

"ఏ అబ్బాయ్. ఐస్ ఫ్రూట్ అబ్బాయ్! ఇలా రా" పిలిచాడు మావాడు. మావాడికి సంపూర్ణ స్వాతంత్ర్యం వుంది యింట్లో నన్నడుగడు సరిగదా, వాళ్ళమ్మను గూడా అడగడు తిన్నగా వాళ్ళ బామ్మ పమిట కొంగు ముడివిప్పి డబ్బులు తీసి కొనుక్కుంటాడు తగని గారాబం వాళ్ల బామ్మ దగ్గర, తాత దగ్గిర

వీధి తలుపు గడియ తీశాను రొప్పుకుంటూ పాపం, ఆ కుర్రాడు లోపలికొచ్చాడు. మొయ్యలేక మోస్తున్నాడు ఆ ఐస్ డబ్బా. కాసేపు ఈ చేత్తో కాసేపు ఆ చేత్తో. అరుగుమీద పెట్టి మూత తీశాడు. మావాడు కెలకటం మొదలు పెట్టాడు.

"అది కాదురా. యిది ఎర్రది."

"అన్నీ వొకటే అబ్బాయిగారూ. మీ యిష్టం" చిరునవ్వుతో అన్నాడు ఆ చిరునవ్వులో ఎంతో ఆశ వున్నట్టుగా నాకు కనపడింది. కాణీకోసం ఎంత తిప్పలు! ఒక్క కానీ బేరం తగిలేటప్పటికి ఎంత వుత్సాహం! ఇదే వుత్సాహం యిదే చిరునవ్వు బట్టల కొట్లో కెళ్ళి ఒక యిరవై రూపాయల సరుకు కొంటే, షాపు యజమాని ముఖంలో గూడా కనిపిస్తాయి కాని ఆ చిరునవ్వు విధిలేక నవ్వినట్టుగా వుంటుంది. అందులో సహజత్వం లేదు. "కాఫీ తెప్పించనా" అని కూడా అడుగుతాడు మనం మర్యాద కోసం ఎలాగూ వద్దంటామని తెలుసు. కాని యీ పసిపాప, పొద్దున్న ఎనిమిదినుంచి పన్నెండు దాకా మళ్ళీ చాలీచాలని రెండు ముద్దలు నోట్లో వేసుకుని వెంటనే ఆ డబ్బా చేత్తో పుచ్చుకుని సాయంత్రం ఆరింటి దాకా మండు టెండలో తిరిగే యీ పసికూన లేత పెదిమలమీద తాండవించిన చిరునవ్వుతో సహజత్వం ప్రకాశిస్తోంది. నిర్మలత్వం పున్నమి వెన్నెలలాగ వికసిస్తోంది

మావాడు ఒకటి తీసుకుని తినేస్తున్నాడు. కానీ డబ్బు తీసుకుని వాడు వెళ్ళిపోతున్నాడు.

"ఒరేయ్! కుర్రాడా" పిలిచా. వెనక్కి తిరిగివచ్చాడు.

"ఏందండి బాబూ, మీకుగూడా కావాలా వొకటి?"

ఎంత ఆత్రుతగా అడిగాడు పాపం!

"ఇంకో రెండియ్యి" అర్ధణా చేతిలో పెట్టి తీసుకున్నా రెండు. నిజంగా నేను పిలిచింది కొనటానికి కాదు. వాడడిగినందుకు కొన్నా.

"నీకెంత యిస్తారురా రోజుకి?"

"పెట్టెకి వంద వుంటాయి పావలా ఇస్తారు రోజుకి. అన్నీ అమ్మితే అరణాలు, అర్ధరూపాయి గూడా యిస్తారు బాబూ. ఎట్లాగైనా పావలా దొరుకుతుంది."

"నీ కాళ్ళకి చెప్పులు లేవేంరా?"

"ఎట్లా వొస్తాయి బాబూ మాకు?" మంచి ప్రశ్న వేశాడు నిజమే ఎలా వస్తాయి వాడికి?

"చదువుకో కూడదురా నువ్వు?"

"మా అమ్మ చదువుకోమంటే, మా నాన్న వొద్దని ఇవి అమ్ముకుని డబ్బులు తెమ్మన్నాడు రోజూ."

నా గొంతుక పూడిపోతోంది మాట సరిగా రావటం లేదు. కళ్ళ నీళ్ళుగూడా వస్తున్నాయి. మాటాడలేక యిక సైగ చేశాను వెళ్ళమని. వెళ్ళిపోయాడు గుమ్మం దిగగానే మా

అబ్బాయి సైకిలురిక్షాలో కూర్చున్నాడు పుస్తకాలసంచి బుజాన వేసుకుని ఆ ఐస్ ఫ్రూట్ అమ్మే కుర్రాడూ, మావాడూ యిద్దరూ ఒకే యీడువాళ్లు నా ఆలోచన అన్నీ పూర్తి అయేటప్పటికీ, మా ఆవిడ ముస్తాబు చేసింది కొడుకుని. అప్పుడే రిక్షా పిలవటం, అందులో వాడిని కూర్చో పెట్టటం, అన్నీ జరిగిపోయినాయి. స్కూలు మా యింటికి అర మైలు దూరం

ఆ ఐస్‌ఫ్రూట్ కుర్రాడు ఎటులేదన్నా అయిదారుమైళ్ళు నడుస్తాడు రోజుకి కనీసం. నిప్పులు చెరుగుతున్నా, పిడుగులు పడుతున్నా నడవక తప్పదు. కాళ్ళకి చెప్పులుండవు. నెత్తిన గొడుగుండదు మావాడు అరమైలు దూరానికి సైకిలు రిక్షా ఎక్కుతాడు ఇవికాక పదిరూపాయలు ఖరీదుచేసే బూట్లు విలువైన తోలు సంచీలో పుస్తకాలు. మూడోక్లాసుకే ఫౌంటెన్ పెన్ను! ఇద్దరిమధ్యా ఎంత అగాధం!

స్కెచ్

# నేరము—శిక్ష

అడుసుమల్లి బాస్కర్

హాస్టలంతా చాలా ప్రశాంతంగా ఉంది.

మాంచి బంగళాలలో అందమైన గదుల్లో ఆనందంగా నిద్రిస్తున్నారు విద్యార్థులు. కటిక నేలమీద మెత్తటి పరుపుమీద కొందరు, నెప్పి నట్లు విసే మంచంమీద చక్కగా నిద్రిస్తున్న వారు కొందరు, ఎవరికేది వీలుగా ఉంటే ఆ విధంగా నిద్రిస్తున్న వారితో హాస్టలు కీచురాయి గోల వినపడేంత నిశ్శబ్దంలో ఉంది అక్కడక్కడ రూముల్లో లైట్లు ఇంకా వెలుగుతూనే ఉన్నాయి వారు పుస్తకాలని విడవలేని వీరుల్లా రాత్రి పన్నెండు అని గంటస్తంభం రొదపెడుతూన్నా నిశ్చలంగా చదువుకుని పోతున్నారు అంత నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అప్పుడప్పుడు ప్రక్కనున్న పిచ్చాస్పత్రిలో కొందరి అల్లరి, హాయిగా గొంతెత్తి పాడుతూన్న నక్కల రాగాలు విన్పిస్తున్నాయి.

ఆకాశం విరిగి మీదపడ్డట్టు ఒక్కసారిగా "దొంగ దొంగ" అనే అరుపు హాస్టలంతా మ్రోగింది వెంటనే చాలామంది లేచారు-ఆ అరుపు వినపడ్డవైపు పోయారు. ఒక మనిషి మాసిన నిక్కరు. చొక్కా, గడ్డముతో తెల్ల ముఖం వేసి నిల్చున్నాడు. వాని ముందు ఈ విద్యార్థి సమూహం గుడ్లెర్రచేసి చూస్తూ నిల్చున్నారు. కొద్దిసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"ఎవరు నువ్వు! ఎందుకొచ్చా విక్కడికి?" అని ఒక విద్యార్థి ప్రశ్నించాడు.

దానికి సమాధానం ఏమీ రాలేదు.

"నీకేంపని? ఇంత రాత్రివేళ నీవిక్కడికొచ్చి ఏంచేదామనుకున్నావు?" అంది ఇంకో కంఠం.

దీనికీ ఏమీ సమాధానం లేదు.

"చెప్తావా చెప్పవా?" గర్జించాడింకోడు.

దానికీ సమాధానం లేదు.

"దొంగ వెధవ – సమాధానం చెప్పడు. ఆ ముఖం చూడండిరా! దొంగముఖం-ఏదీ కర్ర పట్రారా" అన్నాడింకొక శూరుడు.

నిముషాలు గడిచాయి గాని, ఆ మనిషి మాట్లాడలేదు మూగ ఏమో అనుకుంటే ముఖంలో ఏ విధమైన మార్పులేదు. చెవుడు గూడా అనుకున్నారంతా "వాడు ఇంతధైర్యంతో వచ్చి దొంగ వేషాలు వేస్తున్నాడు" అని అందరూ అభిప్రాయపడ్డారు. కొట్టినా తిట్టినా లాభం ఉండేట్టు లేదు. "భయపడేరకం మల్లే లేదు-చాలా అలవాటుపడ్డ దొంగ" అని అనుకుని మూకఉమ్మడిగా అందరు వాడిని బజాయించారు. దెబ్బలుతిన్నా "కిమన్నాస్తి" మాట మాటాడలా! ముఖంలోగూడా మార్పురాలా! ఆశ్చర్యం! ఇంత విద్యాధికమైన బుర్రలకి పాలుపోలా దాని కారణం తికమకపడ్డారు. కొట్టేందుకు ఓపికతగ్గి పోలీసునుపిలిపించారు. మనిషిని